# 'వాణిజ్య దౌత్యవేత్తలు కీలకం'


హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య దౌత్యవేత్తల పాత్ర కీలకంగా మారిందని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో 'విదేశీ వాణిజ్యం-పెట్టుబడులు' అంశంపై ఓ అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ నెల 30దాకా జరిగే ఈ కార్యక్రమానికి ఈజిప్టు నుంచి 14 మంది అగ్రశ్రేణి దౌత్యవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ.. గ్లోబల్ మార్కెట్‌లో తాజా పోకడలు నిపుణుల అవసరాన్ని పెంచుతున్నాయన్నారు. దేశాల మధ్య దౌత్య, రాజకీయ సంబంధాలను పెంపొందించడంలో భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులూ ప్రధానమేనన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ హెడ్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

## బీటీలో భారతీ గ్లోబల్‌కు 24.5% వాటా

### డీల్ విలువ రూ.33,500 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బ్రిటన్‌కు చెందిన బహుళజాతి టెలికం సంస్థ బీటీ గ్రూప్‌లో సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన భారతీ గ్లోబల్‌కు 24.5 శాతం వాటా దక్కుతున్నది. డీల్ విలువ దాదాపు రూ.33,500 కోట్లు (4 బిలియన్ డాలర్లు). కాగా, బీటీ గ్రూప్‌లోని ఆల్టీస్ నుంచి 9.99 శాతం వాటాను వెంటనే కొనేస్తున్న భారతీ.. మిగతా వాటాను రెగ్యులేటరీ అనుమతులు వచ్చాక సొంతం చేసుకోనున్నది. అధిక రుణ భారం నేపథ్యంలోనే ఈ వాటాను ఆల్టీస్ అమ్ముకుంటున్నది. ఇదిలావుంటే టాటా, మహీంద్రా, వెల్స్పన్ తర్వాత బ్రిటీష్ సంస్థల్లో వాటాలను పొందిన భారతీయ సంస్థగా భారతీ ఎంటర్‌ప్రైజెస్ నిలిచింది.




# అటవీ భూములపై అక్రమార్కుల కన్ను

- హరితహారం మొక్కలు నరికివేసి యథేచ్ఛగా పోడు భూముల చదును
- 11వేల మొక్కలు నరికివేసి.. రాత్రిపూట ట్రాక్టర్లతో దున్నిన దుండగులు
- శివంగాళపల్లి అటవీ ప్రాంతంలో భూ కబ్జా
- పట్టించుకోని అధికారులు



శివంగాళపల్లి అటవీ ప్రాంతంలో నరికివేసిన హరితహారం మొక్కలు



మొక్కలను నరికివేసి దుండుగులు చదును చేసిన ప్రాంతం

కోనరావుపేట, ఆగస్టు12: అటవీ భూములపై అక్రమార్కులు కన్నేశారు. పోడు భూములను యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. భూకబ్జాదారులు హరితహారం మొక్కలు నరికివేస్తూ రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో సాగు చేస్తున్నారు. ఇదంతా జరగుతున్న అటవీ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలం శివంగాళపల్లి గ్రామంలో అటవీ భూముల్లో ఉన్న చెట్లను కొందరు దుండగులు నరికి వేసి రాత్రిపూట ట్రాక్టర్లతో చదును చేస్తున్నారు. వెంకటాపూర్ సెక్షన్ పరిధిలో ఉన్న శివంగాళపల్లి శివారులో కంపార్టు నంబర్ 176-3 బ్లాక్‌లో 11, 110 వేల మొక్కలను నాటారు. ఇందులో వేప, రావి, మేడి, మర్రి, అల్లనేరేడు మొక్కలతో పాటు అటవీ ప్రాణులకు ఉపయోగపడే పండ్ల మొక్కలను సైతం నాటారు. దీంతో గ్రామానికి దగ్గరలో విలువైన భూమి కావడంతో కొందరు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయాన హరితహారం మొక్కలను ధ్వంసం చేసి, ట్రాక్టర్‌తో చదును చేసి కలియదున్నారు. సుమారు 50ఎకరాలకు పైగా దున్ని కబ్జా చేశారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు పలువురిపై కేసు నమోదు చేశారు. కానీ ఇటీవల అటవీశాఖ అధికారులు బదిలీ కాగా, వారి స్థానంలో కొత్తవారు రావడంతో అక్రమార్కులు ఇదే అదునుగా భావించారు. అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను తొలగించారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అటవీ భూమిని సైతం కబ్జా చేశారు. సబ్‌స్టేషన్ ఎదుట నుంచి మల్కపేట రిజర్వాయర్ బండ్-1 వరకు అటవీ భూమిలో మొక్కలు నరికివేసి చదును చేశారు. ఇదంతా జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన అధికారులు చొరవ చూపి అన్యాక్రాంతం అవుతున్న అడవులను రక్షించడంతో పాటు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

అటవీ భూములను సాగు చేస్తే కేసులు నమోదు చేస్తాం. శివంగాళపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో హరితహారం మొక్కలు ధ్వంసం చేసి భూమి చదును చేసినట్లు తమ దృష్టికి వచ్చింది. ఇప్పటికే ఆ గ్రామంలో పలువురిపై కేసులు నమోదు చేశాం. ఎవరైనా అటవీ భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం.

**- మోహన్‌లాల్, అటవీశాఖ సెక్షన్ అధికారి, వెంకటాపూర్**

## కాలువపై కప్ప వేయిస్తా

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని గిద్ద చెరువును అనుకుని ఏర్పాటు చేసి పల్లె ప్రకృతి వనానికి వెళ్లే మార్గం ప్రారంభంలో ఉన్న మురుగు కాలువ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. 'ప్రమాదకరం.. పల్లె ప్రకృతి ప్రయాణం' శీర్షికన నమస్తే తెలంగాణలో రెం డు రోజుల క్రితం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీపీల్లో నిధుల్లేవని.. అభివృద్ధి పనులెలా అనుకుని ఎంపీడీవో సత్తయ్య పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డికి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన కృష్ణారెడ్డి మురుగు కాలువపై కప్పును సొంత ఖర్చులతో వేయిస్తానని హామీ ఇచ్చారు.

## నల్ల బ్యాడ్జీలతో 'మోడల్' టీచర్ల నిరసన

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 12: తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మోడల్ స్కూల్‌లో టీచర్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. బదిలీలు లేక 11ఏండ్లుగా ఒకే పాఠశాలలో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 010 పద్దు ద్వారా వేతనాలు మంజూరు చేయాలని భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించి, బదిలీలు చేపట్టాలని కోరారు. ఇక్కడ ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తెలంగాణ చౌక్, ఆగస్టు 12: విద్యార్థులు మత్తు పదర్థాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్, గంజాయి నివారణలో భాగస్వాములవ్వాలని అదనపు ఎస్పీ చంద్రయ్య సూచించారు. సోమవారం అగ్రహారంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. విద్యార్థులకు మత్తు పదార్థాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ సీఐ శ్రీనివాస్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్, ఎస్‌ఐ అంజయ్య ఉన్నారు.

వేములవాడ రూరల్, ఆగస్టు 12: ఫాజుల్‌నగర్, మర్రిపల్లి పాఠశాలలో సోమవారం నషా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ ఎస్‌ఐ మారుతి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

చందుర్తి, ఆగస్టు 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అవగాహన కల్పించారు. ఇక్కడ ఏపీఎం రజిత ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు ఎస్‌ఐ రమాకాంత్ అవగాహన కల్పించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, లెక్చరర్లు ఉన్నారు.

వీర్నపల్లి, ఆగస్టు12: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం విద్యార్థులకు ఎస్‌ఐ ఎల్లాగౌడ్ అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఇక్కడ ప్రిన్సిపాల్ విశ్వనాథం, సిబ్బంది ఉన్నారు.

## బోయినపల్లి లైబ్రేరియన్‌కు అవార్డు

బోయినపల్లి, ఆగస్టు 12: బోయినపల్లి లైబ్రేరియన్ కముటం మలయ్యకు సోమవారం హైదరాబాద్‌లో ఉత్తమ గ్రంథపాలకుడి అవార్డును రాష్ట్ర గ్రంథాయ పరిషత్ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ అందించారు. జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం సందర్భంగా ఆయనకు ఈ అవార్డు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, ఈ అవార్డు రావడం సంతోషంగా ఉన్నదని చెప్పారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిదిలో మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ పృథ్వీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు పదిరలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నేడు రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, ఆగస్టు 12: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించే హుండీ లెక్కింపులో అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

## వాహనాల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్, ఆగస్టు 12: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో, ముస్తాబాద్‌లో ఎస్‌ఐ గణేశ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీలు చేపట్టి పెండింగ్ చలనాలు ఉండొద్దని వాహనదారులకు సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలని, మద్యం తాగి సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కోరెంలో వృద్ధుడి బలవన్మరణం

బోయినపల్లి, ఆగస్టు 12 : కోరెం గ్రామానికి చెందిన మల్కాపురం రాజయ్య (60) అదే గ్రామంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్‌ఐ పృథ్వీధర్‌గౌడ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. కాగా, రాజయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## ఎమ్మార్పీఎస్ నేతల సంబురాలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 12: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎమార్పీఎస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారప్రతినిధి బొల్లారం చంద్రమౌళి ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇక్కడ ఖానాపురం లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ పసుల కమాలకార్, నీరటి బాబు, చెదల దేవయ్య, సుమన్, రాకేశ్ ఉన్నారు.

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. వర్గీకరణ పోరాటంలో భాగస్వాములైన వారందరికీ లక్ష్మణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఆవునూరు ప్రభాకర్, గుండా థామస్, కత్తెర దేవదాస్, వెంకటరాములు, రవి ఉన్నారు

